‘సిరి’ధాన్యాలు

- మార్కెట్‌లో గిరాకీ
- పెరుగుతున్న సాగు విస్తీర్ణం


డుంబ్రిగుడలో రాగుల పంట

డుంబ్రిగుడ: చిరుధాన్యాల సాగుతో గిరిజన రైతులు ఆర్థికాభివృద్ధి సాధిస్తున్నారు. ఏజెన్సీలో పండించే చిరు ధాన్యాలకు మైదాన ప్రాంతాల్లో మంచి గిరాకీ ఉంది. దీంతో ఏటేటా చిరుధాన్యాల సాగు విస్తీర్ణం పెరుగుతూ వస్తోంది. రాగులు, సజ్జలు, జొన్నలు, కొర్రలు, సామలు వంటివి ఎక్కువగా పండిస్తున్నారు. చిరుధాన్యాలు ఆరోగ్యానికి ఎంతో మేలు చేకూరుస్తాయని వైద్యులు, నిపుణులు ధ్రువీకరించడంతో వీటిని విరివిగా వినియోగిస్తున్నారు. సేంద్రియ పద్ధతిలో మన్యంలో చిరుధాన్యాలను సాగు చేయడంతో వీటికి మంచి గిరాకీ ఉంది. దీంతో గిరిజన రైతులు లాభాలు పొందుతున్నారు. రాగుల వినియోగంలో గతంలో చాలా ఎక్కువగా ఉండేది. ఇందులో రాగి ముద్ద, రాగి జావ, రాగి సంకటి వంటి రకరకాల వంటకాలు చేసేవారు. కాలక్రమేణా వరి వినియోగం పెరగడంతో కొంతమేర చిరుధాన్యాల పంటల సాగు తగ్గింది. అయితే కొన్నేళ్లుగా చిరుధాన్యాల ప్రాధాన్యతపై విస్తృత ప్రచారం కావడంతో వీటి వినియోగం గణనీయంగా పెరిగింది. ఫలితంగా గిరిజన ప్రాంతంలో రైతులు ఎక్కువ మోతాదులో పండిస్తున్నారు. గిరిజనులు తప్పనిసరిగా రాగి జావను వినియోగిస్తున్నారు. బీపీ, మధుమేహం వంటివి తగ్గించడంలో రాగులు, కొర్రలు ఎంతగానో దోహదపడతాయని వైద్యులు ధ్రువీకరించడంతో గిరిజనులు సైతం ఎక్కువగా వాడుతున్నారు. మండలంలోని ముఖ్యంగా సొవ్వా, అరమ, పోతంగి, కండ్రుమ్, కితలంగి, లైగండ, అరకు పంచాయతీల్లో ఈ ఏడాది అధిక మొత్తంలో రాగులు, కొర్రలను ఎక్కువగా పండించారు. ఇటీవల కురుస్తున్న వర్షాలకు పంటలు పాడైపోకుండా ఉండేందుకు వ్యవసాయ శాఖ అధికారుల సలహాలు, సూచనలిస్తున్నారు. చిరుధాన్యాల సాగుతో లాభాలు వస్తుండడంతో రైతులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు.

ఆశించిన ధరలు

పండించిన పంట కొంత అమ్ముతాము. కొంత మేము వినియోగించుకుంటున్నాం. గత ఏడాది కంటే ఈ ఏడాది పంట బాగా వచ్చింది. ప్రస్తుతం మార్కెట్‌లో రాగులకు, సాంబాలకు, జొన్నలకు మంచి ధర ఉంది.ఈ దినుసులను కొనేందుకు నేరుగా వ్యాపారులు మా ఊరువద్దకే వస్తున్నారు.

– దాసు, రైతు, డుంబ్రిగుడ

కొనుగోలు కేంద్రాల్లో విక్రయించాలి

గిరిజన రైతులు పండించి సేకరించిన చిరు ధాన్యాలు రాగులు, సాంబాలు, జొన్నలు కొనుగోలు కేంద్రాల్లో విక్రయించాలి. ప్రస్తుతం డుంబ్రిగుడ మండలంలో నాలుగు కొనుగోలు కేంద్రాలను ప్రారంభించాం. పోతంగి, కొర్రాయి, సాగర, అరమలో ఉన్నాయి. రైతులు నేరుగా అక్కడకు తీసుకొచ్చి విక్రయించాలి.

– వాసుదేవర, ఏవో, డుంబ్రిగుడ

వర్షాలతో దెబ్బతిన్న పంట

జూలై, ఆగస్టులలో వర్షాలకు ఈ చిరుధాన్యాల పంటలను వేశాం. పంట చేతికి వస్తుందనే సమయంలో గత నెల భారీ తుపాను, వర్షాల కారణంగా కోతలుచేసి వదిలేసాం. అయితే ప్రస్తుతం ఎండ కాస్తుండడంతో కళ్లాల్లో ఎండబెడుతున్నాం. బాగా ఎండిన తరువాత వాటిని మార్కెట్‌కు తరలిస్తాం.

– కేతు, సిందిపుట్టు, పోతంగి పంచాయతీ, డుంబ్రిగుడ

క్లుప్తంగా

ఈ-కేవైసీ తప్పనిసరి

అడ్డతీగల: రాష్ట్ర ప్రభుత్వం ఆదేశాల మేరకు సొసైటీలో సభ్యత్వం పొందిన రైతులు అందరూ ఈ-కేవైసీ చేయించుకోవాలని అడ్డతీగల సొసైటీ సీఈవో మణిరాజు తెలిపారు. ఆధార్ నంబర్ అనుసంధానమైన మొబైల్ నెంబర్‌కి మాత్రమే ఓటీపీ వస్తుందని, దాని ద్వారానే ఈ కేవైసీ ప్రక్రియ పూర్తవుతుందన్నారు. మరిన్ని వివరాల కోసం సొసైటీ సిబ్బందిని సంప్రదించాలన్నారు.

పంచాయతీల ఆర్థికాభివృద్ధిపై ప్రత్యేక దృష్టి


అవగాహన కల్పిస్తున్న అధికారులు

కొయ్యూరు: పంచాయతీలు సొంత వనరులు సృష్టించుకునే మార్గాలను అన్వేషించాలని ఎంపీడీవో ప్రసాద్ కోరారు. మండల కేంద్రంలోని శుక్రవారం సర్పంచ్‌లు, పంచాయతీ కార్యదర్శులతో ఆయన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పంచాయతీల ఆర్థికాభివృద్ధి కోసం ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నామన్నారు. ఇందులో భాగంగా ఇంటి పన్నుల సేకరణ ఇతరత్రా ఆదాయ వనరులపై ప్రత్యేక దృష్టి సారించాలని సూచించారు. ఏవో బాలమురళీకృష్ణ, సిబ్బంది పాల్గొన్నారు.

బాలికలు అన్ని రంగాల్లో రాణించాలి


కొయ్యూరులో బాలికల మానవహారం

కొయ్యూరు: బాలికలు అన్ని రంగాల్లో రాణించాలని ఎంపీడీవో ప్రసాద్ సూచించారు. బాలికల దినోత్సవాన్ని పురస్కరించుకుని శుక్రవారం రాజేంద్రపాలెం బాలికల ఆశ్రమ పాఠశాలలో ఆటల పోటీలు, మ్యూజికల్ పోటీలు నిర్వహించి, విజేతలకు బహుమతులిచ్చారు. ఎంపీడీవో మాట్లాడుతూ బాలికలు ఉన్నత లక్ష్యాన్ని సాధించేందుకు కృషి చేయాలన్నారు. సీడీపీవో దేవమణి మాట్లాడుతూ పోక్సో చట్టంపై అవగాహన కల్పించారు. ఇన్‌చార్జి హెచ్‌ఎం సత్యవతి, సూపర్‌వైజర్లు విజయలక్ష్మి, సత్యవతి, రామలక్ష్మి, కనకమహాలక్ష్మి, బీపీసీ సోమశేఖర్ పాల్గొన్నారు.

ప్రకృతి సాగుపై అవగాహన


కార్యక్రమంలో పాల్గొన్న విద్యార్థులు

రంపచోడవరం: రంపచోడవరం కృషి విజ్ఞాన కేంద్రంలో గోకవరం జెడ్పీ ఉన్నత పాఠశాల పదో తరగతి విద్యార్థులకు శుక్రవారం ప్రకృతి వ్యవసాయంపై అవగాహన కార్యక్రమం జరిగింది.
పాఠశాల హెచ్‌ఎం పడాల సత్యనారాయణరెడ్డి ఆధ్వర్యంలో ఇండస్ట్రియల్ విజిట్ కార్యక్రమంలో భాగంగా విద్యార్థులకు ఉద్యాన, వ్యవసాయ రంగాల్లో కొత్త రకాలైన పంటల సాగు తదితర విషయాలను కెవీకె కో–ఆర్డినేట్, సీనియర్ శాస్త్రవేత్త డాక్టర్ రాజేంద్రప్రసాద్ వివరించారు. అగ్రికల్చర్ ఇన్‌స్ట్రక్టర్ విజయ్ ఆనంద్, ఉపాధ్యాయులు ప్రదీప్‌కుమార్, రొబ్బి కృష్ణవేణి పాల్గొన్నారు.

సమర్థవంతంగా పంటకోత ప్రయోగాలు


సూచనలిస్తున్న ఏవో చక్రధర్, ఏఎస్‌వో చైతన్య

రాజవొమ్మంగి: పంట కోత ప్రయోగాలను పారదర్శకంగా, తప్పులు లేకుండా సమర్థవంతంగా చేయాలని మండల వ్యవసాయ అధికారి చక్రధర్ అన్నారు. పంట కోత ప్రయోగాలపై గ్రామ వ్యవసాయ సహాయకులు, ఉద్యానసహాయకులకు శుక్రవారం అవగాహన కల్పించారు. ఇన్‌పుట్ సబ్సిడీ, పంటల బీమా పంట కోత ప్రయోగాల ఆధారంగానే లెక్కించడం జరుగుతుందన్నారు. ఏఎస్‌ఓ చైతన్య పంట కోత ప్రయోగాన్ని వివరించారు.

వేతన బకాయిలు చెల్లించాలి

పాడేరు రూరల్: ప్రభుత్వ జిల్లా ఆస్పత్రి పారిశుధ్య కార్మికులు, సీఐటీయూ ఆధ్వర్యంలో శుక్రవారం ఆసుపత్రి వద్ద నిరసన తెలిపారు. ఈ సందర్భంగా పారిశుధ్య కార్మికుల సంఘం అధ్యక్షుడు ఎల్.సుందర్‌రావు మాట్లాడుతూ కార్మికులకు వేతన బకాయిలు చెల్లించాలని, ఏరియర్స్ జమచేయాలని, వేతనాలతో కూడిన సెలవులు ఇవ్వాలని డిమాండ్ చేశారు. న్యాయపరమైన సమస్యలు పరిష్కరించకపోతే సమ్మెకు పిలుపునిస్తామన్నారు.కార్మికులు రత్నలమ్మ, సుజాత, పుణ్యవతి, రాజేశ్వరి తదితరులు పాల్గొన్నారు.

కొనసాగుతున్న వైద్యుల సమ్మె

రాజవొమ్మంగి: మండలంలోని జడ్డంగిలో చేపడుతున్న వైద్యుల సమ్మెకు పీహెచ్‌సీ సిబ్బందితో పాటు 108 సిబ్బంది మద్దతు ప్రకటించారు. ఏజెన్సీలో సేవలందిస్తున్న వైద్యులకు 50 శాతం మూలవేతనాన్ని చెల్లించడం తదితర డిమాండ్లతో ప్రభుత్వ వైద్యులు సమ్మె, నిరాహార దీక్షలు చేస్తున్న సంగతి విదితమే.

ట్రాఫిక్ నిబంధనలు పాటించాలి


వారపుసంతలో డ్రైవర్లకు అవగాహన కల్పిస్తున్న ఎస్‌ఐ పాపినాయుడు

డుంబ్రిగుడ: రోడ్డు భద్రత తప్పక పాటించాలని హెల్మెట్ ధరించకుండా, నిర్లక్ష్యంగా డ్రైవింగ్, మద్యం సేవించి వాహనాలు నడిపిన వారిపై, లైసెన్స్ లేనటువంటి వారిపై చర్యలు తప్పని ఎస్‌ఐ కె.పాపినాయుడు హెచ్చరించారు. ఈ సందర్భంగా అరకు వారపుసంతలో శుక్రవారం ఆటో, ద్విచక్ర వాహనాలదారులకు అవగాహన కల్పించారు.అనంతరం ఆయన మాట్లాడుతూ ప్రతి ఒక్క ఆటో డ్రైవర్ లైసెన్స్‌తో ఖాకీ చొక్కా ధరించాలని, వాహన పత్రాలు ఉండేటట్లు చూసుకోవాలని వారికి సూచించారు. ద్విచక్రవాహనచోదకులు హెల్మెట్ లేకుండా, నిర్లక్ష్య డ్రైవింగ్ చేస్తే చర్యలు తప్పవని ఎస్‌ఐ పాపినాయుడు హెచ్చరించారు. వాహనాల్లో గంజాయితో పట్టుబడితే ఉపేక్షించేది లేదని, జైలు శిక్ష తప్పదని ఆయన హెచ్చరించారు.

గ్రామాల్లో అభివృద్ధి పనులు


రాజుబందలో భవనాన్ని ప్రారంభిస్తున్న సర్పంచ్ శాంతికుమారి, ఎంపీటీసీ నాగమణి

చింతపల్లి: బహుళ ప్రయోజన భవనాన్ని గ్రామస్తులు సద్వినియోగం చేసుకోవాలని లంబసింగి సర్పంచ్ కొర్రా శాంతికుమారి అన్నారు. లంబసింగి పరిధిలోని రాజుబంద గ్రామంలో నిర్మించిన బహుళ ప్రయోజన నూతన భవనాన్ని ఆమె ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఒకే భవనంలో అంగన్‌వాడీ, ఆరోగ్య కేంద్రంతో పాటు కమ్యూనిటీ భవన సౌకర్యాలు ఉంటాయని వాటిని గ్రామ ప్రజలు సద్వినియోగం చేసుకోవాలన్నారు.గ్రామాల్లో అభివృద్ధి పనులు చేశామన్నారు. ఎంపీటీసీ సభ్యురాలు నాగమణి, పీసా కమిటీ చైర్మన్ నాగరాజు, పంచాయతీ కార్యదర్శి అప్పలరాజు, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ సౌజన్య, వైఎస్సార్‌సీపీ నాయకులు రఘునాథ్, గిరి పాల్గొన్నారు.

465 మందికి వైద్య పరీక్షలు


విద్యార్థులకు వైద్యపరీక్షలు చేస్తున్న వైద్యులు

రాజవొమ్మంగి: స్థానిక గిరిజన సంక్షేమ బాలికల గురుకుల పాఠశాలలో శుక్రవారం నిర్వహించిన వైద్య శిబిరంలో సుమారు 465 మంది విద్యార్థులకు వైద్య పరీక్షలు చేసినట్టు ప్రిన్సిపాల్ సత్యవేణి తెలిపారు. ఆదిత్య ఆస్పత్రి (గోకరవరం)కి చెందిన డాక్టర్ షేక్ సల్మాన్ షరీఫ్, డాక్టర్ కె.జార్జ్ మిల్లర్ విద్యార్థులకు వైద్య పరీక్షలు చేసి, సలహాలు, సూచనలిచ్చారు. ఉచితంగా మందులు పంపిణీ చేశారు.

రోడ్డు పనులు ప్రారంభం


వంతమామిడిలో రోడ్డు పనులను ప్రారంభిస్తున్న ఎంపీపీ అనూషదేవి, సర్పంచ్ మహేశ్వరి

చింతపల్లి: తాజంగి పంచాయతీ వంతమామిడి గ్రామంలో సీసీ రోడ్డు నిర్మాణ పనులను ఎంపీపీ కోరాబు అనూషదేవి, సర్పంచ్ వంతల మహేశ్వరిలు శుక్రవారం ప్రారంభించారు. పంచాయతీ, మండల పరిషత్ నిధులతో రోడ్డు నిర్మించనున్నట్టు వారు చెప్పారు. వైస్ సర్పంచ్ రవి,కార్యదర్శి శ్రీధర్,వార్డు సభ్యుడు సదాశివ, నాయకులు లక్ష్మణ్, రాము తదితరులు పాల్గొన్నారు.

అందుబాటులో అదనపు భవనం

మోతుగూడెం: చింతూరు ఐటీడీఏ పీవో శుభమ్ నొఖ్వాల్ చొరవతో మోతుగూడెం పీహెచ్‌సీలో నిరుపయోగంగా ఉన్న భవనాన్ని అందుబాటులోకి వచ్చింది. పీహెచ్‌సీలో నిరుపయోగంగా ఉన్న ఐదు గదులను అరిక్యుసొల్యూషన్ ప్రైవేట్ లిమిటెడ్ సంస్థ సీఎస్‌ఆర్ నిధులతో భవనానికి మరమ్మతులు చేయించి అందుబాటులోకి తీసుకొచ్చారు. సమారసన్ ఫర్ ది నేషనల్ ఎన్‌జీవో సంస్థ వ్యవస్థాపకుడు శ్రీరామ్‌కుమార్, ఏడీఎంహెచ్‌వో పుల్లయ్య ప్రారంభించారు. వైద్యులు, సిబ్బంది పాల్గొన్నారు.

గదులను ప్రారంభిస్తున్న ఏడీఎంహెచ్‌వో పుల్లయ్య →



చెత్త తొలగింపు

సాక్షి ఎఫెక్ట్..


చెత్త తొలగింపు పనులు పర్యవేక్షిస్తున్న పంచాయతీ కార్యదర్శి సింహాచలం

ముంచంగిపుట్టు: మండల కేంద్రం నుంచి పెద్దపుట్టు వెళ్లే మార్గంలో భారత్ గ్యాస్ గోదాం సమీపంలో రోడ్డు పక్కన ఉన్న చెత్తను పంచాయతీ అధికారులు తొలగించారు. ఈ నెల 15న భారత్ గ్యాస్ గోదాం రోడ్డు పక్కన చెత్తతో ఈ మార్గంలో రాకపోకలకు స్థానికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నట్టు ‘సాక్షి’లో ప్రచురితమైన కథనానికి పంచాయతీ అధికారులు స్పందించారు. ఈ మేరకు శుక్రవారం ఉదయం పంచాయతీ కార్యదర్శి సింహాచలం ఆధ్వర్యంలో చెత్త తొలగింపు పనులు చేపట్టారు. ఎక్కడ చెత్త లేకుండా చర్యలు తీసుకున్నారు. దీంతో స్థానికులు హర్షం వ్యక్తం చేశారు. మండల కేంద్రం నుంచి పెద్దపుట్టు వెళ్లే కళాశాల విద్యార్థులు, పలు గ్రామాల గిరిజనులకు రోడ్డు పక్కన చెత్తతో ఇబ్బందులు లేకుండా చర్యలు తీసుకోవడం జరుగుతుందని పంచాయతీ కార్యదర్శి సింహాచలం తెలిపారు.

భక్తులకు అన్నసమారాధన


అన్నసమారాధనలో భక్తులు

మోతుగూడెం: మోతుగూడెం గణపతి ఆలయంలో శుక్రవారం భక్తులకు అన్నసమారాధన కార్యక్రమం నిర్వహించారు. సీతా రాజారావు, ఎస్‌సీవో ఎం.ఎం.కామేశ్వరరావు, డీఈ బాలకృష్ణ, వరప్రసాద్, ఎస్‌ఏవో వరప్రసాద్, ఎంపీటీసీ నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

ఆరోగ్యానికి పోషకాహారం అవసరం


చింతపల్లిలో సీమంతంలో పాల్గొన్న ఎంపీపీ అనూషదేవి, జెడ్పీటీసీ బాలయ్యపడాల్, సీడీపీవో శ్రీదేవి


యార్లగడ్డ సచివాలయంలో గర్భిణులకు సీమంతాలు నిర్వహిస్తున్న సిబ్బంది

చింతపల్లి/రంపచోడవరం/వై.రామవరం/గంగవరం/చింతూరు: అంగన్‌వాడీ కేంద్రాల్లో పోషణ మా కార్యక్రమాల్లో భాగంగా శుక్రవారం ఆరోగ్య భద్రతపై అవగాహన కల్పించారు. గర్భిణులకు సీమంతాలు చేశారు. ఈ సందర్భంగా ప్రజాప్రతినిధులు, వైద్యులు, అధికారులు మాట్లాడుతూ గర్భిణులు తరచూ వైద్య పరీక్షలు చేయించుకోవాలని, ఆరోగ్యానికి పోషకాహారం తప్పనిసరిగా తీసుకోవాలన్నారు. చింతపల్లిలో ఎంపీపీ కోరాబు అనూషదేవి, జెడ్పీటీసీ సభ్యుడు పోతురాజు బాలయ్య, సర్పంచ్‌లు దురియా పుష్పలత, గెమ్మిలి లలిత, రమణమ్మ, మహేశ్వరి, రమేష్‌నాయుడు, కో–ఆప్షన్ సభ్యుడు నాజర్‌వల్లి తదితరులు పాల్గొన్నారు. రంపచోడవరంలో ఎంపీపీ బంధం శ్రీదేవి, జెడ్పీటీసీ సభ్యురాలు పండా వెంకటలక్ష్మి తదితరులు పాల్గొన్నారు. వై.రామవరంలో సర్పంచ్ పల్లాల పద్మావతి, ఎంపీటీసీ సభ్యురాలు వీరమళ్ల సుబ్బలక్ష్మి, ఐసీడీఎస్ పీవో క్రాంతికుమారి తదితరులు పాల్గొన్నారు. గంగవరంలో సీడీపీవో సుచరిత ఆదిలక్ష్మి, ప్రిన్సిపాల్ కె.పద్మావతి, సూపర్‌వైజర్ సీత తదితరులు పాల్గొన్నారు. చింతూరులో ఎంపీడీవో ఎస్.శ్రీనివాసరావు, సీడీపీవో జయలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.


రంపచోడవరంలో పాల్గొన్న ఎంపీపీ, జెడ్పీటీసీ


గంగవరంలో మాట్లాడుతున్న సీడీపీవో సుచరిత ఆదిలక్ష్మి


చింతూరులో విద్యార్థులకు బహుమతులు అందజేస్తున్న ఎంపీడీవో, సీడీపీవో

అంగన్‌వాడీ కేంద్రం ప్రారంభం


కొక్కిరాపల్లిలో అంగన్‌వాడీ కేంద్రాన్ని ప్రారంభిస్తున్న జెడ్పీటీసీ డాక్టర్ వెంకటలక్ష్మి, మండల సర్పంచ్‌ల ఫోరం అధ్యక్షుడు రామకృష్ణ

జి.మాడుగుల: మండలంలోని పాలమామిడి పంచాయతీ కొక్కిరాపల్లిలో అంగన్‌వాడీ కేంద్రాన్ని జెడ్పీటీసీ సభ్యురాలు డక్టర్ మత్స్యరాస వెంకటలక్ష్మి, మండల సర్పంచ్‌లు ఫోరం అధ్యక్షుడు సురభంగి రామకృష్ణ శుక్రవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అంగన్‌వాడీ కేంద్రం సేవలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. గ్రామంలో అంగన్‌వాడీ సెంటర్ లేకపోవడంతో స్థానికులు పడుతున్న ఇబ్బందులను ఐటీడీఏ పీవో, అధికారుల దృష్టికి తీసుకెళ్లి నిధులు మంజూరు చేయించినట్టు తెలిపారు. సీడీపీవో బాలదేవి సమకూర్చిన పరీక్షల అట్టలు, పెన్నులను ఆశ్రమ పాఠశాల విద్యార్థినులకు అందజేశారు. ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ విజయ్ కుమార్, సీడీపీవో బాలదేవి, వైఎస్సార్‌సీపీ మైనార్టీ సెల్ అధ్యక్షుడు అంద్రయ్య, వైఎస్సార్‌సీపీ నాయకుడు ప్రశాంత్, సూపర్‌వైజర్ ఉమా, ఉప సర్పంచ్ రామస్వామి, వార్డు సభ్యుడు మత్స్యయ్య, పీసా కమిటీ ఉపాధ్యక్షుడు కృష్ణారావు, బాబ్జి, శరత్, చిన్నబ్బాయి, అంగన్‌వాడీ టీచర్లు తదితరులు పాల్గొన్నారు.

తాగునీటి సమస్య పరిష్కారానికి చర్యలు

ముంచంగిపుట్టు: లబ్బూరు ఏకలవ్య పాఠశాల విద్యార్థులకు నీటి సమస్య పరిష్కారమయ్యేవరకు ట్యాంకర్‌తో నీటి సరఫరా చేసేందుకు చర్యలు తీసుకోవాలని ఎంపీడీవో ధర్మారావు ఏకలవ్య పాఠశాల ప్రిన్సిపాల్‌కు ఆదేశించారు.మండలంలో గల జోలాపుట్టు పంచాయతీ లబ్బూరు ఏకలవ్య మోడల్ రెసిడెన్షియల్ పాఠశాలను శుక్రవారం ఎంపీడీవో, ఇంజినీరింగ్ అధికారులు సందర్శించారు. పాఠశాల ప్రిన్సిపాల్ సుమన్‌తో మాట్లాడి నీటి సమస్యపై ఉన్నతాధికారులకు నివేదికను పంపిస్తామన్నారు. సర్పంచ్ నీలకంఠం, మాజీ సర్పంచ్ రామస్వామి, జేసీఎస్ జిల్లా కో–ఆర్డినేటర్ జగబంధు,ఇంజనీరింగ్ అసిస్టెంట్ గంగాధర్,విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

గంగవరం: నెల్లిపూడి గ్రామ సచివాలయాన్ని ఎంపీడీవో వై.లక్ష్మణరావు, డిప్యూటీ ఎంపీడీవో నరసింగరావు సందర్శించారు. శుక్రవారం నెల్లిపూడి గ్రామంలో వారు పర్యటించారు. గ్రామంలో పి 4 సర్వే, పారిశుధ్యం, ప్రభుత్వ సంక్షేమ పథకాలు అమలుపై సిబ్బందికి పలు సూచనలు చేశారు.

న్యాయమూర్తిపై దాడి హేయమైన చర్య


కూనవరంలో తహసీల్దార్ శ్రీనివాసరావుకు వినతిపత్రం అందజేస్తున్న నాయకులు


వి.ఆర్.పురంలో సూపరింటెండెంట్ రామారావుకు వినతిపత్రం అందజేస్తున్న నేతలు

కూనవరం: సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి బి.ఆర్.గవాయ్‌పై దాడి హేయమైన చర్య అని, ఈ దాడిని ఎమ్మార్పీఎస్ మండల కమిటీ తీవ్రంగా ఖండిస్తుందని ఎమ్మార్పీఎస్ జిల్లా అధికార ప్రతినిధి గడ్డం వెంకటేశ్వరరావు అన్నారు. ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మందకృష్ణ మాదిగ పిలుపు మేరకు మండల కేంద్రంలో శుక్రవారం ఎమ్మార్పీఎస్ నాయకులు, ర్యాలీ నిర్వహించి, తహసీల్దారు కె.శ్రీనివాసరావుకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లడుతూ సుప్రీంకోర్టు న్యాయమూర్తిపై దాడికి పాల్పడిన వ్యక్తిపై చట్టపరంగా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. నాయకులు వెంకన్నబాబు, విష్ణు, శ్రీను తదితరులు పాల్గొన్నారు.

వి.ఆర్.పురం: సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి బీఆర్ గవాయ్‌పై దాడికి నిరసనగా ఎమ్మార్పీఎస్ ఆధ్వర్యంలో మండల కేంద్రంలో శుక్రవారం ర్యాలీ నిర్వహించారు. బాధ్యులను కఠినంగా శిక్షించాలని కోరుతూ తహసీల్దార్ కార్యాలయం సూపరింటెండెంట్‌కు వినతిపత్రాన్ని అందజేశారు. నాయకులు వెంకటేశ్వర్లు, కృపాకర్, నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

వ్యసనాలకు దూరంగా ఉండాలి


చింతపల్లి డిగ్రీ కళాశాలలో విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న ఎస్‌ఐ వెంకటేశ్వరరావు


గంగవరంలో అవగాహన కల్పిస్తున్న సిబ్బంది

చింతపల్లి: మండల కేంద్రంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఎస్‌ఐ వెంకటేశ్వరరావు ఆధ్వర్యంలో శుక్రవారం విద్యార్థులకు సైబర్ నేరాలపై అవగాహన కల్పించారు. యాప్ లోన్‌లు, ఆన్‌లైన్‌వ్యాపారాలతో అప్రమత్తంగా ఉండాలన్నారు. వ్యసనాలు, మాదకద్రవ్యాలకు దూరంగా ఉండాలని సూచించారు. వైస్ ప్రిన్సిపాల్ ఎం.శ్రీనివాస్ పాత్రుడు, అధ్యాపకులు డాక్టర్ కెజియా, రమణ, జగదీష్, విద్యార్థులు పాల్గొన్నారు.

గంగవరం: మండలంలోని మోహనాపురం గిరిజన సంక్షేమ ఆశ్రమ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు ఆరోగ్య భద్రతపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా హెచ్‌ఎం ఆర్.వి.వి.సత్యనారాయణ మాట్లాడుతూ విద్యార్థులు వ్యసనాలకు దూరంగా ఉండాలని, ఉన్నత చదువులు అభ్యసించాలని సూచించారు. సీపీఆర్‌పై అవగాహన కల్పించారు. పంచాయతీ కార్యదర్శి బ్రహ్మాజీ , గ్రామ సచివాలయ సిబ్బంది సౌజన్య, శ్రీను, దొర, మూర్తి తదితరులు పాల్గొన్నారు.

ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారానికి కృషి


పాడేరు రూరల్: ఏపీటీఎఫ్ మండల నూతన కార్యవర్గం ఎన్నిక శుక్రవారం జరిగింది. కమిటీ అధ్యక్షుడిగా పి.స్వామినాయుడు, ప్రధాన కార్యదర్శిగా పి.బాబూరావు, మహిళా అధ్యక్షురాలిగా రవణమ్మ, ప్రధాన కార్యదర్శిగా బి.సుమలత, గౌరవాధ్యక్షులుగా బాబూరావు, ఉపాధ్యక్షులుగా కైలాసం, అప్పన్నదొర, సూర్యమణి, అప్పారావునాయుడు, కార్యదర్శులుగా రామ్మూర్తి, కృష్ణ, అంజనేయులు, అప్పలనర్సయ్య, కన్నారావు, భీమరాజు ఎన్నికయ్యారు. కౌన్సిలర్లుగా పోతురాజు, భైరవమూర్తినాయుడు, సాంబాబు, దొర, శాంతకుమారి, రామ్మూర్తినాయుడులతో పది మంది సభ్యులను ఎన్నుకున్నారు. పలువురు ప్రతినిధులు మాట్లాడుతూ ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామన్నారు.

కల్వర్టు మరమ్మతు చేయాలని ఆందోళన


కొట్టుకుపోయిన కల్వర్టు వద్ద ఆందోళన చేస్తున్న గిరిజనులు

ముంచంగిపుట్టు: మండలంలోని బుంగాపుట్టు పంచాయతీ చుట్టగొంది గ్రామానికి వెళ్లే మార్గంలో ఉన్న కల్వర్టు ఇటీవల వరద నీటి ఉధృతకు కొట్టుపోయిందని, వెంటనే బాగు చేయాలని గ్రామస్తులు, సీపీఎం ఆధ్వర్యంలో శుక్రవారం ఆందోళనకు దిగారు. రహదారి, కల్వర్టు పాడై రాకపోకలకు తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని ఆవేదన వ్యక్తం చేశారు.ఈ సందర్భంగా సీపీఎం నాయకుడు నీలకంఠం మాట్లాడుతూ బొర్రమామిడి నుంచి చుట్టుగొంది వెళ్లే మార్గంలో కల్వర్టు వర్షానికి కొట్టుకుపోయి, ప్రయాణ కష్టాలు పడుతున్నారని, అత్యవసర సమయాల్లో రోగులను డోలీతో తరలిస్తున్నారని, తక్షణమే అధికారులు స్పందించి నూతన కల్వర్టు నిర్మించాలని,రహదారి సమస్య తీర్చాలని ఆయన డిమాండ్ చేశారు.లేని పక్షంలో ఆయా గ్రామస్తులతో మండల కేంద్రంలో ఆందోళన కార్యక్రమం నిర్వహిస్తామని ఆయన హెచ్చరించారు. గిరిజనులు తిరుపతిరావు,బలరాం,గౌతమ్,గణపతి పాల్గొన్నారు.

గిరిజన అభ్యర్థులకు తీరని అన్యాయం


జెడ్పీటీసీ పోతురాజు బాలయ్యపడాల్

చింతపల్లి: కూటమి ప్రభుత్వం డీఎస్సీ పేరుతో గిరిజన నిరుద్యోగ ఉపాధ్యాయ అభ్యర్థులకు తీరని అన్యాయం చేసిందని జెడ్పీటీసీ సభ్యుడు పోతురాజు బాలయ్యపడాల్ అన్నారు. ఆయన శుక్రవారం విలేకరులతో మాట్లాడుతూ ఏజెన్సీలో గిరిజన నిరుద్యోగ అభ్యర్థులకు బదులుగా గిరిజనేతరులచే పోస్టులు భర్తీ చేయడాన్ని పూర్తిగా ఖండిస్తున్నామన్నారు. గిరిజన అభ్యర్థులకు అన్యాయం చేయమని ప్రకటించిన గిరిజన మంత్రి సంధ్యారాణి ఇప్పుడు ఏ సమాధానం చెబుతారన్నారు. కాఫీ ప్రాసెసింగ్ యూనిట్‌ను మాకవరపాలెం తరలించి కూటమి ప్రభుత్వం నిరుద్యోగ యువతకు అన్యాయం చేసిందని ఆరోపించారు.గిరిజన ప్రాంతంలో జరుగుతున్న అన్యాయాలపై ఉద్యమించేందుకు అన్ని నిరుద్యోగ సంఘాలు, మేధావులు,రాజకీయ నాయకులు తరలిరావాలని పిలుపునిచ్చారు.

విద్యార్థుల చదువుపై ప్రత్యేక శ్రద్ధ

హుకుంపేట: ప్రభుత్వ పాఠశాలలో ఉపాధ్యాయులు సమయపాలన పాటించి విద్యార్థులకు నాణ్యమైన విద్య అందించాలని ఎంఈవో సోమెలి చెల్లయ్య, కోడా ఈశ్వరరావులు అన్నారు. మండలంలోని తీగలవలస పంచాయతీ పనసబంద, కిన్నెర్లోవా గ్రామల్లోని ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలను శుక్రవారం ఆకస్మికంగా సందర్శించారు. రికార్డులు తనిఖీ చేశారు. అనంతరం విద్యార్థుల విద్యా సామర్థ్యాలను పరిశీలించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతు విద్యార్థుల చదువుపై ఉపాధ్యాయులు ప్రత్యేక శ్రద్ధ తీసుకుని నాణ్యమైన విద్య అందించాలన్నారు. సీఆర్పీ రత్నం, విద్యాశాఖ కో–ఆర్డినేటర్ జాన్ తదితరులు పాల్గొన్నారు.